
# స్టార్క్ దెబ్బకు విలవిల

## సన్‌రైజర్స్ వరుసగా రెండో ఓటమి

## విశాఖలో ఢిల్లీ డబుల్



విశాఖపట్నం: ఐపీఎల్-18లో ఢిల్లీ అదరగొడుతోంది. వైజాగ్‌ను తన రెండో సొంత మైదానంగా ఎంచుకున్న ఢిల్లీ.. ఇక్కడ ఆడిన 2 మ్యాచ్‌ల్లో విజయాలతో భళా అనిపించింది. ఆదివారం ఆ జట్టు ఏడు వికెట్ల తేడాతో సన్‌రైజర్స్‌ను చిత్తుచేసింది. బ్యాటింగ్‌పై అతిగా ఆధారపడ్డ సన్‌రైజర్స్.. టాప్‌ఆర్డర్ వైఫల్యంతో మూల్యం చెల్లించుకుంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ స్టార్క్ (5/35), కుల్‌దీప్ యాదవ్ (3/22) విజృంభించడంతో మొదట సన్‌రైజర్స్ 18.4 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. అనికేత్‌వర్మ (74బీ 41 బంతుల్లో 5ఐ4, 6ఐ6) పోరాడకపోయుంటే సన్‌రైజర్స్ పరిస్థితి మరింత ఘోరంగా ఉండేదే. అనికేత్‌ను కాకుండా ట్రావిస్ హెడ్ (22బీ 12 బంతుల్లో 4ఐ4), హెన్రిచ్ క్లాసెన్ (32బీ 19 బంతుల్లో 2ఐ4, 2ఐ6) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. ఓపెనర్లు డుప్లెసిస్ (50బీ 27 బంతుల్లో 3ఐ4, 3ఐ6), జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ (38బీ 32 బంతుల్లో 4ఐ4, 2ఐ6) చెలరేగడంతో ఢిల్లీ 16 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.



**ఛేదన.. ఏకపక్షం:** 164 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ అలవోకగా ఛేదించింది. ప్రధాన పేసర్లు కమిన్స్, మహ్మద్ షమి ఫామ్‌లో లేకపోవడం ఢిల్లీ లక్ష్య ఛేదనను తేలిక చేసింది. కొత్త బంతితో దాడి మొదలుపెట్టిన షమి ప్రభావం చూపలేకపోయాడు. నాలుగో ఓవర్లో బంతినందుకున్న కమిన్స్‌దీ అదే పరిస్థితి. అభిషేక్‌శర్మ, హర్షల్ పటేల్ కూడా ఏమాత్రం బ్యాటర్లను ఇబ్బంది పెట్టలేకపోయారు. జేక్ ఫ్రేజర్ ఆరంభంలో ఆచితూచి ఆడగా.. మరో ఓపెనర్ డుప్లెసిస్ మాత్రం చెలరేగిపోయాడు. దీంతో పవర్‌ప్లేలో డీసీ వికెట్ నష్టపోకుండా 52 పరుగులు సాధించింది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న లెగ్ స్పిన్నర్ జీషన్ అన్సారి (3/42) సన్‌రైజర్స్‌కు బ్రేక్ అందించాడు. పదో ఓవర్లో డుప్లెసిస్, మెక్‌గుర్క్‌లను ఔట్ చేసి సన్‌రైజర్స్‌లో ఆశలు రేపాడు. అయితే మరో ఎండ్‌లో ప్రభావవంతమైన బౌలర్ లేకపోవడం జట్టుకు నష్టం చేసింది. అభిషేక్ పోరెల్ (34 నాటౌట్‌బీ 18 బంతుల్లో 2ఐ4, 2ఐ6) స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించగా.. సీజన్‌లో తన మొదటి మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ (15బీ 5 బంతుల్లో 2ఐ4, 1ఐ6) బౌండరీ, సిక్సర్‌తో బోణీ చేశాడు. రాహుల్‌ను జీషన్ వెనక్కి పంపినా.. పోరెల్, ట్రిస్టన్ స్టబ్స్ (21 నాటౌట్‌బీ 14 బంతుల్లో 3ఐ4) నాలుగో వికెట్‌కు అజేయంగా 51 పరుగులు జోడించి ఢిల్లీని విజయ తీరాలకు చేర్చారు.

**బలమే బలహీనత:** సన్‌రైజర్స్ బలమంతా బ్యాటింగే. ఇప్పుడదే బలహీనతగా మారినట్లుంది. ఒకటి నుంచి అయిదో నంబరు వరకు అత్యుత్తమ.. విధ్వంసకర బ్యాటింగ్ లైనప్ సన్‌రైజర్స్ సొంతం. ఈ అయిదుగురి గురి కుదిరితే 250కి తక్కువ స్కోరును ఊహించలేం. కానీ పరిస్థితులు అనుకూలించనప్పుడు.. టాప్‌ఆర్డర్ బ్యాటర్లు త్వరగా పెవిలియన్ చేరినప్పుడే అసలు సమస్య. ఢిల్లీతో మ్యాచ్‌లో సరిగ్గా అదే జరిగింది. చిన్న స్టేడియం.. ఫ్లాట్ వికెట్‌పై టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నా.. సన్‌రైజర్స్‌కు ఫలితం దక్కలేదు.

ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే సన్‌రైజర్స్‌ను దురదృష్టం వెంటాడింది. అభిషేక్ (1) వారిస్తున్నా.. హెడ్ లేని పరుగు కోసం ప్రయత్నించడం జట్టు కొంపముంచింది. అభిషేక్ క్రీజులోకి చేరుకునేలోపే విప్రజ్ అద్భుతమైన డైరెక్టర్ త్రో అతడిని పెవిలియన్‌కు సాగనంపాడు. అక్కడ్నుంచి పవర్ ప్లే వరకు సన్‌రైజర్స్‌కు కష్టాలే. తన అనుభవాన్నంతా రంగరించి బౌలింగ్ చేసిన స్టార్క్.. సన్‌రైజర్స్‌కు గట్టి దెబ్బతీశాడు. ఒకే ఓవర్లో ఇషాన్ కిషన్ (2), నితీశ్‌కుమార్‌రెడ్డి (0)లను బోల్తా కొట్టించాడు. క్రీజులో కుదురుకున్న హెడ్‌కు స్టార్క్ బౌన్సర్‌తో అడ్డుకట్ట వేశాడు. హెడ్ గ్లోవ్స్‌ను తాకుతూ వచ్చిన బంతిని వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ ఒడిసి పట్టుకున్నాడు. అప్పటికి జట్టు స్కోరు 4.1 ఓవర్లలో 37/4.

**అనికేత్.. కొత్త అస్త్రం:** ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌కు అతిపెద్ద సానుకూలాంశం అనికేత్. ఇప్పటి వరకు అయిదుగురే అనుకున్న బ్యాటింగ్ బలగంలో అనికేత్ కొత్త అస్త్రంగా ఆవిర్భవించాడు. టాప్‌ఆర్డర్ చేతులెత్తేసినా.. కొద్దిసేపు ఢిల్లీ బౌలర్ల పనిపట్టాడు. విప్రాజ్.. అక్షర్ వేసిన 6, 7 ఓవర్లలో సిక్సర్లతో విరుచుకుపడి 32 పరుగులు రాబట్టాడు. క్లాసెన్ కూడా బ్యాటుకు పనిచెప్పడంతో 10 ఓవర్లలో సన్‌రైజర్స్ 105/4తో మెరుగ్గానే కనిపించింది. అయితే మోహిత్‌శర్మ (1/25) బౌలింగ్‌లో క్లాసెన్ భారీ షాట్‌కు ప్రయత్నించి ఔటవడంతో సన్‌రైజర్స్ జోరుకు అడ్డుకట్ట పడింది. కుల్‌దీప్ యాదవ్ అద్భుతమైన బౌలింగ్‌తో హైదరాబాద్‌ను మరింత కష్టాల్లోకి నెట్టాడు. అతను అభినవ్ మనోహర్ (4), కెప్టెన్ కమిన్స్ (2)లను వెనక్కి పంపాడు. ఒక ఎండ్‌లో అనికేత్ చక్కగా ఆడుతున్నా.. మరో ఎండ్ నుంచి అతనికి సహకారం లభించలేదు. 34 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన అనికేత్.. అక్షర్ వేసిన 15వ ఓవర్లో 2 సిక్సర్లు, ఒక బౌండరీతో 17 పరుగులు రాబట్టాడు. ఆ వెంటనే కుల్‌దీప్ బౌలింగ్‌లో సిక్సర్‌తో అలరించిన అనికేత్ (%టూఅఅఎవ్%).. తర్వాతి బంతికే మరో షాట్‌కు ప్రయత్నించాడు. కాని డీప్ మిడ్‌వికెట్లో కళ్లు చెదిరే క్యాచ్‌తో మెక్‌గుర్క్.. అనికేత్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. అప్పటికి సన్‌రైజర్స్ స్కోరు 148/8 కాగా.. అందులో సగం పరుగులు (74) అనికేత్ సాధించినవే కావడం విశేషం. అనంతరం ముల్డర్ (9), హర్షల్ పటేల్ (5)లను ఔట్ చేయడానికి స్టార్క్‌కు ఎంతోసేపు పట్టలేదు.



# హసరంగ మాయాజాలం..

# రాజస్థాన్‌కు తొలి విజయం

## చెన్నైకి వరుసగా రెండో ఓటమి




గువాహటి: రాజస్థాన్ రాయల్స్ మురిసింది. ఆదివారం ఆ జట్టు 6 పరుగుల తేడాతో చెన్నై సూపర్‌కింగ్స్‌ను ఓడించింది. నితీశ్ రాణా (81బీ 36 బంతుల్లో 10ఐ4, 5ఐ6) చెలరేగడంతో మొదట రాజస్థాన్ 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. ఛేదనలో చెన్నై 6 వికెట్లకు 176 పరుగులు చేయగలిగింది. రుతురాజ్ గైక్వాడ్ (63బీ 44 బంతుల్లో 7ఐ4, 1ఐ6) ప్రయత్నం సరిపోలేదు. హసరంగ (4/35) చెన్నైని దెబ్బతీశాడు. ఆర్చర్ (1/13) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు.

చెన్నై తడబాటు: లక్ష్యం మరీ పెద్దదేమీ కాకపోయినా.. రచిన్ రవీంద్ర తొలి ఓవర్లోనే ఔట్ కావడంతో చెన్నై ఛేదన కష్టంగానే సాగింది. పరుగులు అంత తేలిగ్గా రాలేదు. రాహుల్ త్రిపాఠి (23) కొన్ని షాట్లు ఆడినా.. ఎనిమిదో ఓవర్లో వెనుదిరిగాడు. అప్పటికి చెన్నై స్కోరు 46. శివమ్ దూబె (18) ధాటిగానే ఆడినా ఎక్కువసేపు నిలువలేకపోయాడు. విజయ్ శంకర్ (9) కూడా ఇలా వచ్చి అలా వెళ్లాడు. అయితే మరోవైపు ఓపెనర్ రుతురాజ్ (%=బ్బతీథుయ +ఖఅఎ్ఖుఽ%) పట్టుదలగా బ్యాటింగ్‌ను కొనసాగించడంతో చెన్నై రేసులోనే నిలిచింది. జడేజా అతడికి తోడుగా ఉన్నాడు. కానీ సాధించాల్సిన రన్‌రేట్ క్రమంగా పెరిగింది. ఆఖరి 5 ఓవర్లలో 61 పరుగులు చేయాల్సిన పరిస్థితి. హసరంగ బౌలింగ్‌లో సిక్స్‌తో రుతురాజ్ ఊపుమీద కనిపించాడు. అయితే ఆ తర్వాతి బంతికే అతడు ఔట్ కావడంతో చెన్నైపై ఒత్తిడి పెరిగింది. ధోని, జడేజా వేగంగా ఆడలేకపోవడంతో ఆఖరి రెండు ఓవర్లలో చెన్నైకి 39 పరుగులు అవసరమయ్యాయి. 19వ ఓవర్లో (తుషార్) ధోని ఫోర్, సిక్స్.. జడేజా ఓ సిక్స్ కొట్టడంతో మ్యాచ్ కాస్త ఆసక్తికరంగా మారింది. కానీ ఆఖరి ఓవర్లో సందీప్ శర్మ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. తొలి బంతికి వైడ్ వేసినా.. ఆ




వెంటనే ధోనిని ఔట్ చేయడంతో చెన్నై ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

**రాణా ధనాధన్:** రాజస్థాన్ అంతకుముందు అనుకున్నదాని కంటే తక్కువ స్కోరుతోనే సరిపెట్టుకుంది. నితీశ్ రాణా విధ్వంసంతో ఆ జట్టు భారీ స్కోరు చేసేలా కనిపించినా... ద్వితీయార్థంలో చెన్నై బంతితో అద్భుతంగా పుంజుకుని రాయల్స్‌కు కళ్లెం వేసింది. మిగతా బ్యాటర్లలో పరాగ్ మినహా ఇంకెవరూ రాణించకపోవడంతో రాజస్థాన్‌కు నిరాశ తప్పలేదు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్.. తొలి ఓవర్లోనే జైస్వాల్ (4)ను కోల్పోయినా, నితీశ్ రాణా విరుచుకుపడడంతో భారీ స్కోరు దిశగా పరుగులు పెట్టింది. కళ్లు చెదిరే స్ట్రోక్ ప్లేతో అలరించిన అతడు.. పరాగ్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. బంతి లెంగ్త్‌ను బాగా అర్థం చేసుకున్న నితీశ్.. ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లు బాదేశాడు. ఫ్లిక్, పుల్, ర్యాంప్ షాట్లతో అదరగొట్టాడు. పేసర్లు ఒవర్టన్, ఖలీల్‌లతో పాటు స్పిన్నర్ అశ్విన్ బౌలింగ్‌లోనూ అతడు చెలరేగిపోయాడు. అశ్విన్ బౌలింగ్‌లో స్లాగ్ స్వీప్‌తో నితీశ్ రెండు సిక్స్‌లు కొట్టాడు. 21 బంతుల్లోనే అర్థశతకం సాధించాడు. దూకుడుగా ఆడలేకపోయిన శాంసన్ (20) ఎనిమిదో ఓవర్లో వెనుదిరిగినా.. పరాగ్ తోడుగా రాణా జోరు కొనసాగించడంతో 12వ ఓవర్లో రాయల్స్ 124/2తో తిరుగులేని స్థితిలో నిలిచింది. అలవోకగా 200 దాటేలా కనిపించింది. కానీ అదే ఓవర్లో రాణా నిష్క్రమించడంతో మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. పట్టుబిగించిన చెన్నై.. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ రాజస్థాన్‌కు కళ్లెం వేసింది. పతిరన, నూర్ అహ్మద్, ఖలీల్ చక్కగా బౌలింగ్ చేశారు. 14వ ఓవర్లో జురెల్‌ను నూర్, ఆ తర్వాతి ఓవర్లో హసరంగ (4)ను జడేజా ఔట్ చేశారు. రాయల్స్ చివరి అయిదు ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 37 పరుగులే చేసింది. ముఖ్యంగా పతిరన అద్భుతంగా బౌలింగ్ చేశాడు. తన చివరి మూడు (16వ, 18వ, 20వ) ఓవర్లలో 16 పరుగులు మాత్రమే ఇచ్చాడు.



# ఆసియా రెజ్లింగ్.. దీపక్, ఉదిత్‌లకు రజతాలు

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మరో మూడు పతకాలు చేరాయి. దీపక్ పునియా (92 కేజీ), ఉదిత్ (61 కేజీ) రజతాలు సొంతం చేసుకున్నారు. ఆదివారం 92 కేజీల ఫైనల్లో దీపక్ 0-10తో అమీర్ ఫిరోజ్‌పోర్ (ఇరాన్) చేతిలో ఓడిపోయాడు. ఈ పోరులో ఆరంభంలోనే 0-3తో వెనుకబడిన దీపక్.. తర్వాత కోలుకోలేకపోయాడు. అంతకుముందు సెమీస్‌లో దీపక్ 8-1తో తకాషి ఇషిగురో (జపాన్)ను ఓడించాడు. 61 కేజీల్లో ఉదిత్ రెండో స్థానంలో నిలిచాడు. తుది పోరులో అతడు 4-6తో తకరా సుడా (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. దినేశ్ (125 కేజీలు) కాంస్యం సాధించాడు. ముకుల్ దహియా (86 కేజీ) నిరాశ పరిచాడు. కాంస్య పతక పోరులో అతడు 2-4తో తత్‌సుయా షిరాయ్ (జపాన్)కు తలొంచాడు. 74 కేజీల విభాగంలో జైదీప్ అహ్లావత్ తొలి రౌండ్లోనే ఓడాడు. అతడు 5-10తో హికారు టకాట (జపాన్)కు తలొంచాడు.



